క్లుప్తంగా

పారదర్శకంగా ఉపాధి పనులు



సామాజిక తనిఖీలో అధికారులు

కోవూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని ఎన్ఆర్ఈజీఎస్ అధికారి సురేష్ తెలిపారు. కోవూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ బహిరంగ వేదికను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ పనులు చేపట్టే ముందు, పూర్తయిన తర్వాత తప్పనిసరిగా ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు లేకుంటే టెక్నికల్ అసిస్టెంట్ నుంచి నిధుల రికవరీ చేస్తామన్నారు. కూలీల హాజరు కూడా తప్పక నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణుగోపాల్, అంబుడ్స్ మెన్ వెంకటరెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, డ్వామా ఏపీడీలు శ్రీహరిరెడ్డి, మృధుల తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

- ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు



సబ్‌స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఎన్వీఎస్ సుబ్బరాజు

కోవూరు : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా సిబ్బంది పనిచేయాలని ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఎన్వీఎస్ సుబ్బరాజు తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ ఈఈ చాంబర్‌లో డివిజన్ పరిధిలోని అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినియోగదారులకు డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఈ వి.విజయన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సునీల్, శీనయ్య, సతీష్, వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ అబీద తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

- ఏడీ గురవారెడ్డి



మనుబోలు : పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు మనుబోలు, వెంకటాచలం మండలాల్లోని పశు వైద్యశాలల్లో ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు మనుబోలు పశువైద్యశాల ఏడీ డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. మనుబోలు పశు వైద్యశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నేషనల్ యానిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా టీకాలు వేస్తున్నట్లు తెలియజేశారు. అలాగే మేకలు, గొర్రెలకు పారుడు వ్యాధి నివారణకు టీకాలు వేస్తామన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. పాడి రైతులకు 75 శాతం సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. విత్తనాల కోసం రైతులు వారి పరిధిలోని ఆర్బీకేల్లో సంప్రదించాలని కోరారు. అలాగే పాడి రైతులందరూ తమ పశువులకు బీమా చేయించుకోవాలని సూచించారు.

నేడు జగదేవిపేటలో క్రికెట్ పోటీలు

ఇందుకూరుపేట : సంక్రాంతి సందర్భంగా మండలంలోని జగదేవిపేటలో శనివారం నుంచి గ్రామస్థాయి క్రికెట్ పోటీలు జరుగుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు సుజిత్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని వివరించారు.

కోవూరులో మానవహారం



కోవూరు : జన్ భాగీదారీ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పొదుపు మహిళలు, సచివాలయ ఉద్యోగులు పెద్ద ఎత్తున మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



ఇందుకూరుపేట : వాలీబాల్ పోటీలో క్రీడాకారులు

కొడవలూరు : ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. బాలికల బ్యాడ్మింటన్, ఖోఖో విభాగంలో కమ్మపాళెం సచివాలయం జట్లు విజేతలుగా నిలిచి నియోజకవర్గ పోటీలకు ఎంపికయ్యాయి. పురుషుల విభాగంలో ఖోఖోలో మిక్కిలింపేట, బ్యాడ్మింటన్‌లో యల్లాయపాళెం సచివాలయ జట్లు విజేతలుగా నిలిచి నియోజకవర్గ పోటీలకు ఎంపికయ్యాయి. ఈ పోటీలను ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీలను పంచాయతీ కార్యదర్శులు జి.జాలయ్య, జి.రాధాకృష్ణ, అంకమరాణి, విజయలక్ష్మి, శీనమ్మ, బి.మధు, డి.సురేష్‌కుమార్ పర్యవేక్షించారు.

కబడ్డీ విజేత కృష్ణపట్నం

ముత్తుకూరు : ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన కబడ్డీ ఫైనల్స్‌లో కృష్ణపట్నం–ముసునూరువారిపాళెం జట్లు తలపడ్డాయి. ఇందులో కృష్ణపట్నం సచివాలయం జట్టు విజయం సాధించింది. ఖోఖోలో నారికేళపల్లి సచివాలయం విజయం సాధించింది. ఎంవీపాళెం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఫిషరీస్ కళాశాలలో కృష్ణపట్నం–ముత్తుకూరు–3 మధ్య జరిగిన క్రికెట్ పోటీలో కృష్ణపట్నం విజయం సాధించింది. ఈ జట్లు నియోజకవర్గ పోటీలకు అర్హత సాధించాయి.

- ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు శుక్రవారం కోలాహలంగా జరిగాయి. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు.
- కోవూరు : స్థానిక పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీహరి, ఏపీఎం వెంకటస్వామి, ఫిజికల్ డైరెక్టర్లు దేవిక, మధుసూదన్‌రావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.
- పొదలకూరు : ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా స్థానిక కాకాణి రమణారెడ్డి స్టేడియంలో క్రికెట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. పొదలకూరు, తాటిపర్తి సచివాలయ జట్ల మధ్య సెమీఫైనల్స్ జరిగింది. పొదలకూరు సచివాలయం బిట్–1 జట్టు విజేతగా నిలిచి ఫైనల్స్‌కు చేరుకుంది.



కొడవలూరు : ఆసక్తిగా సాగుతున్న ఖోఖో పోటీలు



ముత్తుకూరు : విజేతగా నిలిచిన కృష్ణపట్నం కబడ్డీ టీమ్



కొడవలూరు : బ్యాడ్మింటన్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ



కోవూరు : కబడ్డీలో తలపడుతున్న మహిళలు



పొదలకూరు : క్రికెట్ విజేతలతో ఎంఈఓ శోభనాద్రి

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



వెంకటాచలం : వీఎస్‌యూలో వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ, అధ్యాపకులు



విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద నున్న వీఎస్‌యూలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వివేకానంద చిత్రపటానికి వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన గొప్ప వ్యక్తి వివేకానంద అని కొనియాడారు. వివేకానందుని జీవితం గురించి యువత పూర్తిస్థాయిలో తెలుసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

విడవలూరు : నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపల్ బి.సుజాత అన్నారు. స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో ముందస్తు సంక్రాంతి



ముత్తుకూరు : విద్యార్థులపై భోగి పండ్లు చల్లుతున్న సిబ్బంది

కొడవలూరు : మండలంలోని దామేగుంట సచివాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పొంగళ్లు పొంగించి అందరికీ పంచి పెట్టారు. రంగవల్లుల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేయడంతో పాటు పోటీల్లో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తంబి సురేష్, సచివాలయ సిబ్బంది వరలక్ష్మి, మానస, లిఖిత, రమణమ్మ, వసుంధర పాల్గొన్నారు.

- ముత్తుకూరు : గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు, జాతీయ యువజన దినోత్సవాన్ని శుక్రవారం జరుపుకున్నారు. ఇందులో భాగంగా ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి అంజలి ఘటించారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా విద్యార్థులపై భోగి పండ్లు పోశారు. పతంగులు, రంగవల్లుల పోటీలు జరిపారు. కొత్త కుండలతో పాలు పొంగించి, పొంగళ్లు పెట్టించారు. విద్యార్థుల కేరింతల నడుమ భోగి మంటలు వేశారు.
- ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరులో శ్రీవశిష్ట జూనియర్ కళాశాలలో ముందస్తు భోగి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల కరెస్పాండెంట్ వైవీ సుబ్రహ్మణ్యం, ఇఫ్కో ఏపీ మార్కెటింగ్ మేనేజర్ విజయానందరెడ్డి, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ సీఈఓ మహేష్ పాల్గొన్నారు. తొలుత కళాశాల ఆవరణలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు.



కొడవలూరు : దామేగుంటలో రంగవల్లుల నడుమ పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు



ఇందుకూరుపేట : భోగి వేస్తున్న విద్యార్థులు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెం రైల్వేగేటు సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (55) శుక్రవారం వేకువజామున ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పింక్, వైట్ గడుల ఫుల్ షర్ట్, బ్లూ కలర్ లుంగీ ధరించి ఉన్నాడు. కావలి రైల్వే ఎస్సై అరుణకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94406 27648 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి

వెంకటాచలం : మతిస్థిమితం లేని వ్యక్తి కాలుజారి బావిలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడులో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన కె.నరసింహస్వామి(45) కొన్ని నెలలుగా తిక్కవరప్పాడులోని తాళ్ల కోటేశ్వరరావు నివాసంలో ఉంటున్నాడు. కాగా మతిస్థిమితం లేని నరసింహస్వామి గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. ఇదే క్రమంలో పంట పొలాల్లోని నేల బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. బంధువులు గాలిస్తుండగా, బావిలో శవమై తేలడంతో స్థానికులు బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

అందుబాటులో యూరియా



మాట్లాడుతున్న మండల ఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి

కోవూరు : రైతులకు కావల్సిన యూరియా అందుబాటులో ఉందని మండల ఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను తప్పక పాటించాలన్నారు. ఏడీఏ సుజాత మాట్లాడుతూ వారంలోగా అన్ని ఆర్బీకేలకు యూరియా పుష్కలంగా అందించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల ఏఓ ఇందిరావతి పాల్గొన్నారు.

నేడు తోటపల్లిలో మంత్రి కాకాణి పర్యటన

తోటపల్లిగూడూరు : మండలంలోని తోటపల్లి పంచాయతీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పంచాయతీ పరిధిలో జరిగే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు.

ఎంపీటీసీపై అనర్హత వేటు పడనుందా?

- పార్టీ మారితే ఇబ్బందులే

పొదలకూరు : మండలంలోని అమ్మవారిపాళెం ఎంపీటీసీ కొమ్మి అరుణపై అనర్హత వేటు పడే అవకాశాలు ఉన్నాయి. ఈమె వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీగా విజయం సాధించి ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు ఇటీవల టీడీపీ నేత సోమిరెడ్డిని కూడా కలిసినట్లు తెలుస్తోంది. అయితే వైఎస్సార్‌సీపీ గుర్తుపై విజయం సాధించిన అరుణ పార్టీ మారితే వెంటనే ఆ పార్టీ నాయకులు కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. దీంతో ఎంపీటీసీపై అనర్హత వేటు పడనుంది.

యూరియా విషయంలో ఆందోళన వద్దు



పడుగుపాడు రైల్వే యార్డును పరిశీలిస్తున్న డీఏఓ సత్యవాణి

కోవూరు : ప్రస్తుత సీజన్‌లో యూరియా విషయంలో ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు రైల్వే యార్డ్ నుంచి ఆర్బీకేలకు పంపేందుకు సిద్ధంగా ఉన్న యూరియా లోడ్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15వ తేదీలోగా మొత్తం 11,600 మెట్రిక్ టన్నుల యూరియా వస్తోందని, ఇందులో 10 వేల మెట్రిక్ టన్నులు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు పంపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 2,500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఆమె వెంట మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్, సీనియర్ మేనేజర్ శ్రీనివాసులు, కోవూరు ఏడీఏ సుజాత, మండల ఏఓ ఇందిరావతి ఉన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతుల ప్రదానం

ముత్తుకూరు : ముత్తుకూరులో ఆర్యవైశ్య సంఘం–వాసవి క్లబ్, వాసవి వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో, సంతూర్ సంస్థ సహకారంతో శుక్రవారం ముగ్గుల పోటీలు జరిపారు. మొత్తం 40 మంది పాల్గొనగా, నందిని అనే మహిళకు ప్రథమ, సరాబు రమాదేవికి ద్వితీయ, షైదా అనీలకు తృతీయ బహుమతి లభించింది. పది మందికి కాన్సొలేషన్ బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేత డాక్టర్ మురళీకృష్ణ, గవర్నర్ పేర్ల వెంకటసత్యనారాయణ, ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ చందా వెంకటస్వామి, రీజనల్ చైర్మన్ గుడివాడ ఉమామహేశ్వరావు, జెర్సీ చందా వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు చెక్కా శ్రీనివాసలు, గుడివాడ సుజాత, సంతూర్ ప్రతినిధులు మనోజ్‌కుమార్, మోహన్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



పొదలకూరు : తోడేరులోని కాకాణి రమణారెడ్డి స్టేడియం ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జాతీయస్థాయి క్రీడాకారులను శుక్రవారం సన్మానించారు. చెరుకూరు ఝాన్సీ(రగ్బీ), సీహెచ్ నవీన్‌కుమార్(క్యారమ్స్) జాతీయ స్థాయిలో రాణించారు. మాజీ నేషనల్ అంపైర్ అంజాద్, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, పార్టీ నేతలు చెరుకూరు ప్రసాద్, రావుల దశరథరామయ్యగౌడ్, వాకాటి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కామాక్షితాయి హుండీ కానుకల లెక్కింపు

- రూ.32.17 లక్షల రాబడి



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడారు. గతేడాది నవంబర్ 7వ తేదీ నుంచి శుక్రవారం వరకు సమకూరిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు. రూ.32.17 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఈఓ గిరికృష్ణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా ఉదయ్‌శంకర్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఉదయ్‌శంకర్

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ్‌శంకర్ రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకున్నారు. వెలగపూడిలోని సచివాలయంలో 2022–23 సంవత్సరంలో ఎన్ఎస్ఎస్ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి శుక్రవారం అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో రాష్ట్ర ఉత్తమ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా డాక్టర్ ఉదయ్‌శంకర్, ఉత్తమ ప్రోగ్రాం అధికారిగా వెంకటసాయి తేజ, ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా పల్లపు ప్రియా, పృథ్వీరాజు అవార్డులు అందుకున్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



కోవూరు : అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు



తోటపల్లిగూడూరు : ఇస్కపాళెంలో మానవహారం



విడవలూరు: ముదివర్తి గ్రామంలో..

కోవూరు : జన్ భాగీదారీ కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో అంబేడ్కర్ చిత్రపటానికి శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, ఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రాజగోపాల్ పాల్గొన్నారు.

తగిన గుర్తింపు

తోటపల్లిగూడూరు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తోందని ఎంపీడీఓ ప్రత్యూష అన్నారు. జన్ భగీదారీ కార్యక్రమంలో భాగంగా ఇస్కపాళెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అధికారులు శుక్రవారం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

విడవలూరు: బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ముదివర్తి సొసైటీ చైర్మన్ కొండూరు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ముదివర్తి గ్రామంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కొండూరు వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మానవహారం నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సౌందర్య, పార్టీ నేతలు కె.రఘు, నావూరు గోపి, కె.సందీప్ పాల్గొన్నారు.